క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కనిగిరిరూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఈనెల 10న గురువారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మొహమ్మద్ సయనా బేగం తెలిపారు. ప్రయాణికులు 9959225701కు ఫోన్ చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి

హనుమంతునిపాడు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, ఫర్నీచర్, తాగునీటి సౌకర్యాలు సక్రమంగా ఉండాలన్నారు. 1200 ఓట్లు దాటితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ షేక నాగూల్ మీరా, ఆర్ఐ జి, చైతన్య, వీఆర్వోఓ, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య, హాజరు శాతాన్ని పెంచాలి

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరుశాతాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక వడ్డెపాలెం పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమం సందర్భంగా మొక్కలు నాటించాలని సూచించారు.

బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలి

కనిగిరిరూరల్: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో బుధవారం బడి పిలుస్తోందిపై అవగాహన, ర్యాలీని వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బడికి పంపించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జయశ్రీ, మనోహర్, రమేష్ బాబు, ఓ శ్రీనివాస్, ఖాశిం సాహెబ్, ప్రసన్న లక్ష్మీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పీసీపల్లి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై కోటయ్య అన్నారు. మండలంలోని మురుగుమ్మి పాఠశాలలో విద్యార్థులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు.

తూతూమంత్రంగా శిక్షణ

టంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ తూతూమంత్రంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన శిక్షణ 11:20 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5:15 గంటల వరకు నిర్వహించాల్సి ఉండగా మధ్యాహ్నం 3 గంటలకే మమ అనిపించారు. శిక్షణకు లైన్ డిపార్టుమెంటు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజినీరింగు అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు హాజరు కావాల్సి ఉండగా కొందరు మాత్రమే హాజరయ్యారు. ఏఎన్‌ఎంలు ఎవ్వరూ హాజరు కాలేదు. అధికారులు కేవలం కార్యక్రమం నిర్వహించామని చెప్పుకోడానికే తప్ప శిక్షణ తూతూమంత్రంగా చేసినట్లు తెలుస్తోంది.

మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణమోహన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

కనిగిరిరూరల్: కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన డానియేల్ జోసఫ్ బదిలీపై వెళ్లిన విషయం విదితమే. కృష్ణమోహన్‌రెడ్డి గతంలో కనిగిరి రెవెన్యూ కార్యాలయంలో ట్రైనీ ఇర్ఐగా పనిచేశారు. ప్రస్తుతం ఏపీ సెక్రటేరియెట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ.. కనిగిరికి కమిషనర్‌గా వచ్చారు. ఈ మేరకు మున్సిపల్, సిబ్బంది, పలువురు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రముఖులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

అటవీశాఖకు పరిహారం కోసం భూముల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేట వద్ద 167బీ జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న అటవీశాఖకు పరిహారంగా భూములు ఇచ్చేందుకు మండలంలోని ఆనికాలపల్లివద్ద బుధవారం భూములను తహసీల్దార్ షేక్.మహ్మద్ హుస్సేన్, ఎఫ్ఎస్ఓ అలీమ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీజీపేట గ్రామం సమీపంలో 167బీ జాతీయ రహదారి నిర్మాణం ద్వారా రిజర్వు ఫారెస్ట్ 1.79 హెక్టార్ల భూమిని కోల్పోతుండగా నిబంధనల ప్రకారం అటవీశాఖకు రెండు రెట్లు అదనంగా భూమి బదిలీ చేయాల్సి ఉంది. దీంతో ఆనికాలపల్లివద్ద సర్వే నంబర్ 106 లో 4.46 ఎకరాల భూమిని తహసీల్దార్, ఎఫ్ఎస్ఓ లు సదరు భూమిని పరిశీలించారు. దీనిపై నివేదికను ఉన్నతాదికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్ గురుబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించండి.. ఇబ్బందులు తీర్చండి



ముళ్లచెట్లతో వావిలేటిపాడు-జమ్ములపాలెం రహదారి



వావిలేటిపాడు- జమ్ములపాలెం రోడ్డుకు శంకుస్థాపన(ఫైల్)

- వావిలేటిపాడు- జమ్ములపాలెం రోడ్డుకు రూ.2.75 కోట్లు మంజూరు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన
- ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభం కాని పనులు
- రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వ నాయకులు
- పనులు ప్రారంభానికి ప్రభుత్వ అనుమతి కావాలంటున్న అధికారులు
- రోడ్డు నిర్మిస్తే మా ఇబ్బందులు తీరుతాయంటున్న రైతులు

జరుగుమల్లి(సింగరాయకొండ): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి అటకెక్కింది. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైన పనులను సైతం పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు నుంచి టంగుటూరు మండలం జమ్ములపాలెం వెళ్లేందుకు అనువుగా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.2.75 కోట్లు తారురోడ్డు నిర్మాణానికి మంజూరయ్యాయి. దీంతో తమ కష్టాలు తీరతాయని వావిలేటిపాడు, జమ్ములపాలెం గ్రామాల రైతులు భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పనులు అటకెక్కాయి. ఏడాది దాటినా రోడ్డు నిర్మాణానికి ఒక అడుగు కూడా ముందుకు పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు గ్రామాల రైతులకు ఎంతో మేలు..

జరుగుమల్లి మండలం వావిలేటిపాడు, టంగుటూరు మండలం జమ్ములపాలెం మధ్య సుమారు మూడు వేల ఎకరాలకు పైగా సాగుభూమి ఉంది. ఈ ప్రాంతంలో పొగాకు, మిర్చి, జామాయిల్, ఇతర పంటలు సాగు చేస్తుంటారు. వావిలేటిపాడు గ్రామానికి చెందిన పొలాలు జమ్ములపాలెం పంచాయతీ పరిధిలో, జమ్ములపాలెం గ్రామానికి చెందిన పొలాలు వావిలేటిపాడు పంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన వారు అటు వెళ్లాలన్నా, వారు ఇటు రావాలన్నా సుమారు 9 కిలోమీటర్ల దూరం రావాల్సి ఉంటుంది. అదే ఈ రోడ్డు నిర్మాణం కనుక పూర్తయితే కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే రాకపోకలు సాగించటానికి అవకాశం ఉంటుందని, అంతేకాక తాము పండించిన పంటలు రవాణా చేసుకోవటానికి సమయం ఆదా అవటమే సుమారు 6 కిలోమీటర్ల దూరం ఆదా అయ్యే అవకాశం ఉందని రైతులు తెలియజేస్తున్నారు.

ప్రయాణం..నరకప్రాయం

కూటమి ప్రభుత్వంలో పాలకులు రోడ్డును గాలికొదిలేశారు. దీంతో పొలాలకు వెళ్లే ఈ రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి ద్విచక్ర వాహనం పై వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని అదే ట్రాక్టరు ద్వారా వెళ్లలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డు సుమారు 30 నుంచి 50 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉండగా చాలా చోట్ల ఆక్రమణకు గురై కేవలం 10 నుంచి 20 అడుగులు మాత్రమే ఉందని, రోడ్డు నిర్మాణం జరిగితే రోడ్డు వెడల్పుగా ఉండి రాకపోకలకు అనువుగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ రమణయ్యను వివరణ కోరగా..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 25 శాతం పనులు పూర్తయిన వాటిని మాత్రమే పూర్తి చేయాలని, ప్రారంభం కాని వాటిని ఆపాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

దారి సక్రమంగా లేదు



నా పొలాలు వావిలేటిపాడు పంచాయతీ పరిధిలో ఉన్నాయి. నా పొలాలకు వెళ్లాలంటే పొలాల మధ్య దారి సక్రమంగా లేదు. తారురోడ్డు నిర్మిస్తే దూరం తగ్గటమే కాక సమయం ఆదా అవుతుంది. పండిన పంటలను త్వరగా మార్కెట్‌కు తీసుకుని వెళ్లటానికి అవకాశం ఉంది.

–కాకుమాను కోటేశ్వరరావు, రైతు, జమ్ములపాలెం

రోడ్డు నిర్మిస్తే ఎంతో అనుకూలం



పొగాకు, మిర్చి, జామాయిల్ పంటలు సాగు చేస్తుంటాను. నా పొలాలు జమ్ములపాలెం పంచాయతీ పరిధిలో ఉన్నాయి. పొలాల మధ్యలో నుంచి వెళ్లాలంటే రోడ్డు మార్గం సరిగా లేక సుమారు 9 కిలోమీటర్ల దూరం చుట్టు తిరిగి వెళ్లాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే దాదాపు 6 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది.

– పాలేటి రవి, రైతు, వావిలేటిపాడు

నిత్యం 200 పైగా బేళ్లు తిరస్కరణ

- పొగాకు రైతుపై అదనపు భారం
- వాటిని మళ్లీ తీసుకురావాలంటే అధిక వ్యయప్రయాస



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఏడో రౌండ్ పొగాకు వేలం ప్రారంభం నుంచి పొగాకు బేళ్లు అధిక సంఖ్యలో తిరస్కరణకు గురవుతున్నాయి. ఏడో రౌండ్ ప్రారంభమైన రోజు నుంచి రౌండ్ చివరి దశ సమయం వరకు రోజుకు దాదాపుగా 200 పైచిలుకు బేళ్లు తిరస్కరణకు గురవుతూ వచ్చాయి. అసలే మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బేళ్ల తిరస్కరణతో ఖర్చు అధికమవుతుందని వాపోతున్నారు. అధికారులు పర్యటించి అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని వ్యాపారస్తులకు సూచించినా వ్యాపారస్తులు అధికారుల మాటలను పట్టించుకోవట్లేదు. గత శనివారం రీజినల్ మేనేజర్ సేలం రామారావు పరిశీలించి అన్ని బేళ్లు కొనుగోలు చేయాలని వ్యాపారస్తులకు సూచించారు. వ్యాపారస్తులు ఆ సమయంలో కొనుగోలు చేస్తామన్నట్లు చెప్పారు. గత సంవత్సరంలో కేజీ రూ.240 పలికిన లో గ్రేడ్ పొగాకును ప్రస్తుతం వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో తీసుకుని వచ్చిన బేళ్లను రైతులు వెనక్కి తీసుకువెళుతున్నారు. బేళ్లను వెనక్కి తీసుకువస్తే చెదిరి కాటా తగ్గుతుందని, మళ్లీ వేలానికి తీసుకురావాలంటే రూ.2000 వరకు ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పైడిపాడు, గోగినేనివారిపాలెం, అక్కడచెరువుపాలెం గ్రామాల రైతులు 1195 బేళ్లను తీసుకురాగా 924 బేళ్లను కొనుగోలు చేసి 271 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.218.66గా నమోదైంది.

రేపు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో భారీగా జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శింగారెడ్డి సతీష్ రెడ్డి, మాజీ మంత్రి, ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రులు అనిల్‌కుమార్ యాదవ్, ఆర్‌కే రోజా, మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారన్నారు. కె. ఉప్పలపాడు నుంచి బైక్ ర్యాలీ, పొగాకు వేలం కేంద్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం కూడా నిర్వహిస్తామన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

కొండపి: కొండపిలో జరిగే వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం, బాబు షూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం కొండపిలో ఆయన మాట్లాడారు. మాజీ జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, నజీర్, దివి పిచ్చయ్య చౌదరి, నారాయణ, రాజు, సురేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



కేక్‌కట్ చేస్తున్న గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ నేతలు

వెలిగండ్ల (కనిగిరి రూరల్): వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి పొల్లా సుబ్రహ్మణ్యం, ఆవుల తిరుపతిరెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, తాతపుడి సురేష్ బాబు, గూడూరి అనీల్ బాబు, తాతపుడి నానీ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

కనిగిరిరూరల్: ఎన్నికల జాబితా నిర్వహణపై బూత్ లెవల్ అధికారులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఆర్డీఓ జీ కేశవర్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ అధికారి, వెలిగండ్ల తహసీల్దార్ ఎస్ వాసు, అధికారులు రవిచంద్ర, రమణారెడ్డి, నాగేశ్వరరావు, పిల్లి వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకుపోవాలి

- ప్రజలను మోసంచేయడంలో బాబు బహుముఖ ప్రజ్ఞాశాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ



'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దద్దాల నారాయణ, నేతలు

సీఎస్‌పురం(పామూరు): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన 'బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 'రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పై పార్టీ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దద్దాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయికి తీసుకువెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. సూపర్‌సిక్స్ అంటూ హామీలిచ్చి ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. అనంతరం మండల నాయకులతో కలిసి 'బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 'రీకాల్ చంద్రబాబూ మేనిఫెస్టో' క్యూర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు.

విజయమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి వచ్చే 2029 ఎన్నికల్లో పార్టీ విజయంసాధించి అధికారం చేపట్టేలా పనిచేయాలన్నారు. నూతన మండల కమిటీలు, గ్రామ కమిటీలు త్వరితగతిన పూర్తిచేయాలని మండల నాయకులకు సూచించారు. వైఎస్సార్ సీపీ పేదల పక్షపాత పార్టీ అని, అన్ని వర్గాలకు సమన్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసయాదవ్, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, భువనగిరి వెంకటయ్య, భూమిరెడ్డి వెంకటరెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, బసివి చంద్రశేఖర్, చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, వాకమళ్ల రాజశేఖర్‌రెడ్డి సైకం ఏడుకొండలరెడ్డి, ముప్పాళ్ల వసంతరాజు, మోరం మురార్జి, యం.ఆటీలయ్య, రాజేష్, ఆశం పెద్దబాలిరెడ్డి, చిన్నబాలిరెడ్డి, అంబాల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నమోదు చేయాలి

సీఎస్‌పురం(పామూరు): 2025–26 పంచాయతీ సూచికను పారదర్శకంగా సచివాలయ సిబ్బంది నమోదు చేయాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో పంచాయతీ పురోగతి సూచిక నమోదుపై సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. మొత్తం 164 అంశాలపై సమాచారం నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, డీటీ పి.వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు



టంగుటూరులో ర్యాలీ..

కనిగిరిరూరల్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెబాట పట్టారు. ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో జెండాలె చేతబూని ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిలదీస్తూ.. నినాదాలు చేశారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో సభలు నిర్వహించారు. ఖాశింపీరా, దీపకల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాడని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వైరవీంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. తొలుత కామ్రేడ్ హనీఫ్ నగర్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. జీపీ రామారావు, పందిటి మోహన్, ఎస్‌కే ఖాదర్‌బాషా, పుట్టా సుబ్బారావు, కోటయ్య, జి.కిరణ్, పుల్లమ్మ, చింతగుంట్ల రవి తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు, రైతు సంఘంనాయకుడు పిల్లి తిప్పారెడ్డి, ఎస్‌కే బషీరా, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: కార్మిక సంక్షేమానికి వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జరుగుమల్లిలో సీఐటీయూ జిల్లా నాయకుడు మోజెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

టంగుటూరు: సమ్మెలో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్, నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి రాము, ఏఐటీయూసీ నాయకుడు టి.ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

మర్రిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఆయాలు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు.

కొండపి: ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే పనులు కేంద్ర ప్రభుత్వం చేయడం శోచనీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ అన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఆశా వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్, రైతు సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ నిర్వహించారు. మల్లెల కొండయ్య, ఐఎఫ్‌టీయూ మండల నాయకుడు చంద్రశేఖరరావు, భారతి, కృష్ణ, గడ్డం వందనం పాల్గొన్నారు.

పామూరు: లేబర్‌కోడ్ చట్టాలను తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు కే.మాల్యాద్రి, ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

సీఎస్‌పురం(పామూరు): సీఐటీయూ నాయకుడు నన్నపురెడ్డి తిరుపతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డిమాండ్లు పరిష్కరించేవరకు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.

హనుమంతునిపాడు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



కనిగిరిలో కార్మిక సంఘాల ర్యాలీ..



జరుగుమల్లిలో ర్యాలీ..